# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 9-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 6 పేజీలు:6 వెల: రూ.1/-




## పీవీ సింధును అభినందించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆగష్టు 8:కామన్వెల్త్ క్రీడల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు స్వర్ణ పతకం సాధించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవీ సింధుకు శుభాకాంక్షలు తెలిపి, ఆమెను అభినందించారు .

ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు విక్టరీ కొట్టింది. కెనడా క్రీడాకారిణి మిచ్చెల్ లీతో జరిగిన మ్యాచ్‌లో 21-15, 21-13 స్కోర్‌తో విజయం సాధించి పసిడి పతకాన్ని పట్టేసుకున్నది. దీంతో ఇండియా ఖాతాలో గోల్డ్ మెడల్స్ సంఖ్య 19కు చేరుకున్నది. తొలి గేమ్‌లో సింధు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అన్ని రకాల షాట్లను ఆడింది. ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టింది. మిచ్చెల్ లీ ప్రపంచ నెంబర్ 14వ ర్యాంక్ కాగా, సింధు వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న విషయం తెలిసిందే.

స్వతంత్ర భారత వజ్రోత్సవాలు
తెలంగాణ రాష్ట్రం

# అట్టహాసంగా వజ్రోత్సవ వేడుకలు.. జాతీయజెండాను ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆగష్టు 8: స్వతంత్ర భారత వజ్రోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పక్షం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. హెచ్ఐసీసీలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి.. జాతిపిత గాంధీజీ, భరతమాత విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం 75 మంది వీణ కళాకారులచే వీణా వాయిద్య ప్రదర్శన చేపట్టగా.. సీఎం కేసీఆర్ వీక్షించారు.

ఆ తర్వాత సాండ్ ఆర్ట్ ప్రదర్శన, దేశభక్తి ప్రబోధ నృత్యరూపకం, ఫ్యూజన్ ప్రదర్శన, లేజర్ షో జరుగనున్నాయి. మధ్యాహ్నం 1 గంటకు తెలంగాణ ప్రజలను ఉద్దేశించి స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందేశాన్ని ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ఇవ్వనున్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాల నుంచి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు హెచ్ఐసీసీకి తరలివచ్చారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్, ఎంపీ కే కేశవరావు, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





## స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలను ప్రారంభించిన సీఎం కేసీఆర్

తెలంగాణలో నేటి నుంచి స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. ఇప్పటికే వజ్రోత్సవాలకు తెలంగాణ ముస్తాబైంది. సోమవారం హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. నేటి నుంచి ఈ నెల 22 వరకు ఉత్సవాలు జరగనున్నాయి.

# మహాత్ముడు ఎప్పటికైనా మహాత్ముడే : సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆగష్టు 8:మహాత్ముడిని కించపరిచే వ్యాఖ్యల్ని వింటున్నాం ఇది బాధాకరమని, మహాత్ముడు ఎప్పటికైనా మహాత్ముడే అని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో చేసిన త్యాగాలు ఈనాటి తరానికి తెలియవన్నారు. 1987 సిపాయిల తిరుగుబాటు కీలకం అని, సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం ఇంకా అణచివేసిందన్నారు.

వారి తిరుగుబాటు విఫలమైనా స్వాతంత్ర్యం కోసం మరింత బలమైన పోరాటాన్ని కొనసాగించారని అన్నారు. మహాత్ముడిని కించపరిచే వ్యాఖ్యల్ని వింటున్నాం.. ఈ వ్యాఖ్యలు చాలా బాధ కలిగిస్తున్నాయన్నారు. వీటిని ఎవరైనా సరే ఖండించాలన్నారు. ఆ శక్తుల చిల్లర ప్రయత్నాలు ఎప్పటికీ నెరవేరవన్నారు. మహాత్ముడు ఎప్పటికైనా మహాత్ముడే అన్నారు. పేదరికం ఉన్నంత వరకు ఆక్రందనలు, అలజడులు కొనసాగుతాయి. పేదరికాన్ని నిర్మూలిస్తేనే సమానత్వం, స్వేచ్ఛ లభిస్తాయన్నారు. ప్రశాంత భారతంలో జాతిని చీల్చే కుట్రను తిప్పికొట్టాలని, అవసరమైతే జాతీయ స్థాయిలో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన యోధులందరికీ మన అందరి తరపున నివాళులు అర్పిస్తున్నాం అన్నారు.

### వాడవాడలా స్వతంత్ర స్ఫూర్తి తెలిసేలా వజ్రోత్సవ వేడుకలు : సీఎం కేసీఆర్

ఎన్ని త్యాగాలు.. ఎన్ని పోరాటాలు.. ఆవేదనలతో స్వాతంత్ర్యం సిద్ధించింది.. ఆ స్ఫూర్తిని అందరికీ తెలిసేలా వాడవాడలా.. గ్రామగ్రామాన అద్భుతంగా స్వతంత్ర వజ్రోత్సవ వేడుకలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. స్వతంత్ర వజ్రోత్సవ వేడుకలు హెచ్ఐసీసీలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదట సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఎగుర వేసి, జెండావందనం చేశారు. ఆ తర్వాత భరతమాత, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలవేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

స్వతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ సేవలను కొనియాడారు. 'అనేక త్యాగాలతో, అనేక పోరాటాలతో స్వాతంత్ర్యాన్ని సముపార్జించి 75 సంవత్సరాలు స్వయంపాలనలో అప్రతిహాతంగా ముందుకుసాగుతున్న భారతావని. 75 సంవత్సరాలు రేపు రాబోయే 15వ తేదీకి పూర్తి చేసుకుంటుంది. సుదీర్ఘకాలం స్వయంపాలనలో సుసంపన్నమైన భారతదేశంలో తరాలు మారుతున్నాయ్. కొత్త తరాలు వస్తున్నాయ్. వారికి స్వాతంత్ర్య పోరాట సమయంలో జరిగిన సమరం, త్యాగాలు కొత్త తరానికి తెలియవు. ఎప్పటికప్పుడు సందర్భోచితంగా కొత్త తరం వారికి తెలియజేయడం పాతతరం వారి కర్తవ్యం, విధి' అని అన్నారు.

### ఏ దేశానికైనా స్వేచ్ఛ, స్వాతంత్ర్య ఒక అపురూప సందర్భం

ఏ దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఒక అపురూపమైన సందర్భమని సీఎం కేసీఆర్ అన్నారు. 'భారత స్వాతంత్ర్యం కూడా సుదీర్ఘమైన పోరాటం. సుమారు ఒకటిన్నర శతాబ్దం పాటు కొనసాగిన పోరాటం. అనేక మంది పెద్దలు, అనేక రకాల పద్ధతుల్లో వలస పాలకులకు వ్యతిరేకంగా అపురూపమైన త్యాగాలు చేస్తూ పోరాటాలు చేశారు. దాంట్లో ప్రధానంగా 1857 సిఫాయిల తిరుగుబాటును తీసుకుంటాం. ఇక్కడ మనం చెప్పుకోవాల్సిన విశేషమేంటంటే.. సిఫాయిలు తిరుగుబాటు రాజ్యం పడిపోవాలి. విప్లవపంథాలో విప్లవాలు చెలరేగి.. విప్లవ శక్తులు విజయం సాధించిన వేళకూడా రాజ్యానికి సహకరించే సగం మంది విప్లవకారులతో కలిసినప్పుడే విజయం సాధిస్తుంది.

అట్లాగే సాయుధ బలగాలు పోరాటం, తిరుగుబాటు చేస్తే రాజ్యంపోవాలే. కానీ, భారత స్వతంత్ర సమరంలోని ఉజ్వలఘట్టం ఆ నాటి బ్రిటిష్ వలస రాజ్యం కూలిపోలే. ఆ తర్వాత బలంగా అణచివేత ప్రారంభించారు. అయినా స్వతంత్ర ఉద్యమకారులు సిపాయిల తిరుగుబాటు లాంటి అరూపఘట్టమే ఫెయిల్ అయ్యిందని ఎనూడు నిరాశ చెందలే. అదే స్ఫూర్తితో వైఫల్యాన్ని పాఠంగా నేర్చుకొని పోరాటాన్ని కొనసాగించారు. బాలగంగాధర్ తిలక్ నేతృత్వంలో అనేక సాంస్కృతిక పోరాటాలు వచ్చాయ్. లాలాలజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్ ఇలా అనేక మంది పోరాటాలు చేశారు. ఝాన్సీ లక్ష్మీభాయి, ఎంతో మంది రాజులు, సంస్థానాదీశులు యావత్ ఆసేతుహిమాచలం ఒకటై పోరాటం జరిపారు' అని సీఎం కేసీఆర్ కొనియాడారు..

### విశ్వమానవుడు మహాత్మా గాంధీ..

'బారిష్టర్ చదువుకొని, చాలా సంపాదించుకునే అవకాశాలుండి.. గొప్ప అడ్వకేట్‌గా పేరున్న మహాత్మా గాంధీ.. ఆయన స్వతంత్ర సమరానికి నాయకత్వం వహించి.. నడుం బిగించారు. దక్షిణాఫ్రికాలో ఎదుర్కొన్న జాతివివక్ష, అనేక వ్యవహారాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపి.. నాజాతి కూడా ఇదే పద్ధతిలో పోరాటం చేస్తుందని ఆయన భారత్‌కు రావడం జరిగింది. చాలా గొప్ప బిడ్డను కన్నది మన భరత మాత. భారతదేశ స్వతంత్ర సముపార్జన సారథే కాదు.. యావత్ ప్రపంచానికే అహింసా సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాంతిదూత, విశ్వమానవుడు మన మహాత్మాగాంధీ. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉండే కాలంలో.. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం జరిగిన సందర్భంలో ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబమా వచ్చారు.

పార్లమెంట్ జాయింట్ సెషన్‌లో ప్రారంభించారు. ఉపన్యాసం ప్రారంభించే సమయంలో విలువైన మాట చెప్పారు. ఆ రోజు మన భారతీయులందరి గుండెలు పులకిపోయాయి. వ్యక్తిగతంగా నేను గర్వపడ్డాను. 'గాంధీ గారు ఈ ప్రపంచంలో పుట్టకపోయి ఉంటే.. ఒబమా అనే నేను అమెరికా అధ్యక్షుడిని అయ్యేవాడినే కాదు'? ఇది అమెరికా అధ్యక్షుడు చెప్పిన మాట. ఐన్‌స్టిన్ శాస్త్రవేత్త మహాత్మాగాంధీ అనే వ్యక్తి రక్తమాంసాలతో పుట్టి ఈ భూమిమీద నడయాడుతడు అనుకోలేదు.. అంతటి మహాత్ముడి అని ఐన్‌స్టీన్ చెప్పారు. ఆఫ్రికాలో ఎంతో పోరాటంచేసిన నెల్సన్ మండేలా.. నాకు ప్రముఖమైన స్ఫూర్తి ప్రధాత గాంధీ అని చెప్పారు. గాంధీ విశ్వమానవుడు.. ఆయనను కన్న గడ్డ నా భరత జాతి. అటువంటి జాతికి వారసులం మన అందరం' అని అన్నారు.

### అద్భుతంగా వజ్రోత్సవ వేడుకలు జరుగాలి

'మనం ఎంతో గర్వంగా, సంతోషంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మహాత్మాగాంధీ వారసులుగా ఈ దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి కంకణంకట్టుకున్న వ్యక్తులుగా మనం ప్రజాసేవరంగంలో మునిగి ఉన్నాం. మీ అందరికీ శ్రమ ఇచ్చి రాష్ట్రం నలుమూల నుంచి పిలిపించిన కారణం ఏంటంటే.. ఒక మహోజ్వలమైనటువంటి స్వతంత్ర వజ్రోత్సవ దీప్తి.. వాడవాడల గ్రామగ్రామాన చాలా అద్భుతంగా జరగాలి. చాలా గొప్పగా ఎన్ని త్యాగాలతో,ఎన్ని రకాల పోరాటాలతో, వేదనలు.. ఆవేదనలతో స్వాతంత్ర్యం వచ్చిందో ప్రతిగడపకు తెలిసేలా నిర్వహించాలి. జిల్లాలో మంత్రుల ఆధ్వర్యంలో కమిటీలు ఉన్నయ్.

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ అధ్యక్షులు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు అందరు తమ పరిధిలో ఉజ్వలం నిర్వహించాలని, ఆ స్ఫూర్తిని ఈ వేదికగా మీరు పొంది తిరిగి మీ మీ గ్రామాలు, పట్టణాల్లో అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు రప్పించాం అని మనవి చేస్తున్నా' అన్నారు. 'ఏయే సందర్భంలో ఎవరు త్యాగాలు చేశారు, ఎన్ని రకాల పోరాటాలు చేశారు.. అలవోకగా తమ అసువులు, ఆయుష్షును దేశ స్వాతంత్ర్యం కోసం ధారబోశారు.. మరణానికి వెనుకాడకుండా.. మడమ తిప్పకుండా పోరాటాలు చేశారు.. అలాంటి స్ఫూర్తి, త్యాగనీరతితో మనం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది' అన్నారు.

## పీవీ సింధును అభినందించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 8:బర్మింగ్‌హామ్‌లో జరుగుతున్న కామన్‌వెల్త్ క్రీడల బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో స్వర్ణం సాధించిన పీవీ సింధు ను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అభినందించారు.

కామన్‌వెల్త్ క్రీడల్లో షట్లర్ పీవీ సింధు, యువ బాక్సర్ నిఖత్ జరీన్‌లు తమ సత్తా చాటి పసిడి పతకాలు గెలవడం దేశానికి గర్వ కారణమని అన్నారు. స్వర్ణ పతకాన్ని సాధించిన అందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నిఖత్ జరీన్‌ను అభినందించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆగష్టు 8:కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకం నెగ్గిన తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారు. మహిళల 50 కేజీల విభాగంలో నిఖత్ 5-0తో కార్లే మెక్ నాల్ (నార్త్ ఐర్లాండ్)పై విజయం సాధించింది. గతేడాది జాతీయ చాంపియన్‌షిప్ నుంచి బరిలోకి దిగిన ప్రతి టోర్నీలో అద్వితీయ ప్రదర్శన కనబరుస్తున్న నిఖత్.. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన విషయం తెలిసిందే. అదే జోరు బర్మింగ్‌హామ్‌లోనూ కొనసాగించిన ఈ ఇందూరు అమ్మాయి..

అదిరిపోయే పంచ్‌లతో ప్రత్యర్థిని బెదరగొట్టింది.

## రాజ్యసభలో వెంకయ్య నాయుడు భావోద్వేగ ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగష్టు 8:రాజ్యసభలో వెంకయ్య నాయుడు భావోద్వేగ ప్రసంగం చేశారు. తనను ఉప రాష్ట్రపతి పదవికి ఎంపిక చేస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పినప్పుడు కన్నీళ్లు ఆగలేదన్నారు. తాను అడగకుండానే పార్టీ తనకు ఉప రాష్ట్రపతి పదవిని కట్టబెట్టింది. ఆ రోజు పార్టీని వీడాల్సి వచ్చినందుకు కన్నీళ్లు వచ్చాయన్నారు. బాధతోనే బీజేపీకి రాజీనామా చేశానని వెంకయ్య నాయుడు గుర్తు చేసుకుని, భావోద్వేగానికి లోనయ్యారు.సభ్యులు సభ గౌరవాన్ని కాపాడాలని కోరారు. ప్రజాస్వామ్యం గౌరవం మరింత పెరిగేలా నడుచుకోవాలని సూచించారు. సభలో మాట్లాడే భాషకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తొలి ప్రాధాన్యం మాతృభాషకు, తర్వాత సోదర భాషకు ఇవ్వాలన్నారు. సభలో మాతృభాషలో మాట్లాడటాన్ని ప్రోత్సహించాను అని చెప్పారు. సభ గౌరవం కాపాడేందుకు కొన్నిసార్లు కఠినంగా వ్యవహరించాను. సభలో ఎవరూ శత్రువులు ఉండరు.. ప్రత్యర్థులే ఉంటారు. పోటీలో ఇతరులను మించిపోవడానికి మనం కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలన్నది తన కోరిక అని స్పష్టం చేశారు. మీరు చూపించిన ప్రేమకు, ఆప్యాయతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, ఆగష్టు 8: టీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు కోళ్లపడకల్ నుంచి పెద్ద గోల్కొండ వరకు రోడ్డును నిర్మించాలని మంత్రిని కలిసి కోరారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాలలో దెబ్బతిన్న రోడ్లను దశల వారీగా చేపట్టి పూర్తి చేస్తామని ఆమె అన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రోడ్డు పనులను చేపట్టాలని ఆమె ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తుందన్నారు.సీఎం కేసీఆర్ పాలనలోనే రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు. కార్యక్రమంలో హనుమగల్ల చంద్రయ్య, సర్పంచ్‌లు నారాయణ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మెగావత్ రాజునాయక్, మోతీలాల్‌నాయక్, స్లీవారెడ్డి, కంది అరుణ, బండారు లావణ్య, మంత్రి సంధ్య, గుత్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులు రాష్ట్రంలో వర్షాలు.. రెడ్ అలెర్ట్ జారీ

హైదరాబాద్, ఆగష్టు 8: తెలంగాణ సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం పేర్కొంది. ఈ మేరకు రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి, కొత్తగూడెం, సిద్ధిపేట జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.పలుచోట్ల గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను ప్రకటించింది.

## గోల్డ్ మెడల్ కొట్టిన పీవీ సింధు



హైదరాబాద్, ఆగష్టు 8:హైదరాబాదీ షట్లర్ పీవీ సింధు ఖాతాలో గోల్డ్ మెడల్ పడింది. బర్మింగ్‌హామ్‌లో జరుగుతున్న కామన్‌వెల్త్ క్రీడల బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు విక్టరీ కొట్టింది. కెనడా క్రీడాకారిణి మిచ్చెల్ లీతో జరిగిన మ్యాచ్‌లో 21-15, 21-13 స్కోర్‌తో విజయం సాధించి పసిడి పతకాన్ని పట్టేసుకున్నది. దీంతో ఇండియా ఖాతాలో గోల్డ్ మెడల్స్ సంఖ్య 19కు చేరుకున్నది. తొలి గేమ్‌లో సింధు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అన్ని రకాల షాట్లను ఆడింది. ప్రత్యర్థిని ముప్పుతిప్పులు పెట్టింది. మిచ్చెలి లీ ప్రపంచ నెంబర్ 14వ ర్యాంక్ కాగా, సింధు వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న విషయం తెలిసిందే.

### చరిత్రలో నేటినిజం



కం॥ 'చిలుకూరు' వంశమందున
పలుభాషలు తెలిసినట్టి పండితునుడై
చెలగిన 'నారాయణు'నకు
తెలతాలవము నిలచునయ శమ కమలాక్షుడిజెన్!!

(ఆగష్టు 9 చిలుకూరు నారాయణరావు జయంతి...)

-రాధశ్రీ
సెల్: 9494481210



# అడవి పుత్రులకు హక్కులు ఉండవా?!

## (09 ఆగష్టు 'ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినం' సందర్భంగా)

స్వయంకృషిని మాత్రమే నమ్ముకొని, సాధారణ నాగరిక సమాజానికి దూరంగా జీవనయానం సాగించే ఆదివాసీ, స్వదేశీ జాతులు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 90 దేశాల్లో కోట్లలో విస్తరించి ఉన్నారు. ఇలాంటి ఆదివాసీ గిరిజన జాతులు జనజీవన స్రవంతికి దూరంగా అడవుల్లో, ద్వీపాల్లో తమదైన ప్రత్యేక జీవనశైలితో తమదైన సంస్కృతి వారసత్వాల సంపదలతో అమాయకంగా, అనాగరిక బతుకులను అనుభవిస్తున్నారు. నేటి డిజిటల్ యుగపు శాస్త్రసాంకేతిక ఫలాలు వీరి దరికి నేటికీ చేరలేదనేది చేదు వాస్తవం. ప్రపంచంలో తొలిసారి నీగ్రో నల్లజాతి ఆఫ్రికన్లను బానిసలుగా చేసుకొన్ అమెరికన్లు అమానవీయంగా, పశువుల వలె వాడుకున్నారు. అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలు, భాషలు, వేషధారణలు, కులమతాలు, సాంప్రదాయాలతో మమేకమవుతూ, ఆధునిక హంగులకు దూరంగా, ప్రభుత్వ సహాయం అందని, మానవ హక్కులు తెలియని, చిన్న చిన్న మైనారిటీ సమూహాలుగా జీవిస్తుంటారు. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో 5,000లకు పైగా ఆదివాసీ ప్రాంతాల్లో 60 కోట్ల ఆదివాసీలు ( ప్రపంచ జనాభాలో 6.2 శాతం) 2680 ఆదివాసీ భాషలతో ప్రత్యేక జీవన విధానంతో బతుకుతున్నారని అంచనా. అడవి పుత్రులుగా నేల, ప్రకృతి వనరులు, జీవ సంపదపై ఆధారపడే వృత్తుల్లో దీనస్థితులలో బతుకులు సాగిస్తున్నారు.

2007లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ఆదివాసీ జాతుల మానవ హక్కుల పరిరక్షించబడాలని, వారికి అభివృద్ధి ఫలాలు అందాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏట 09 ఆగష్టున (1982 ఆగష్టు 09న నిర్వహించిన తొలి ఆదివాసీ జనుల సమావేశానికి గుర్తుగా) 'ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. స్వదేశీ జాతులకు ఉద్యోగ, ఉపాధి, విద్య, ఆరోగ్యం, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ, గుర్తింపులను అందించాలనే ప్రయత్నాలు నేడు జరుగుతున్నాయి. వలస రాజ్య పాలనతో ఆదివాసీలు అమానవీయంగా మార్చబడినారు. ఆదివాసీ జాతులు అనారోగ్యం, పేదరికం, వివక్షలతో అమానవీయ దుర్భర బతుకులను ఈడ్చుతున్నారు. ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినం-2021 నినాదంగా 'ఏ జాతిని వదలొద్దు - ఆదివాసీలతో సామాజిక బప్పందం' అనే అంశాన్ని తీసుకున్నారు. ఐరాస 2005-15 దశాబ్దాన్ని 'అంతర్జాతీయ ఆదివాసీ దశాబ్దం'గా పాటించడం మనకు తెలుసు. ఆదివాసీల్లో 86 శాతం అసంఘటిత, అనధికార ఆర్థిక వ్యవస్థలో కడు పేదరిక ఉచ్చులో చిక్కి ఉన్నారు. ప్రపంచ ఆదివాసీల్లో 47 శాతం అవిద్య అనబడే జబ్బుతో నిరుద్యోగులుగా ఉండిపోతున్నారు.

### భారతంలో ఆదివాసీలు:

జనాభాలో 2వ స్థానం, వైశాల్యంలో 7వ స్థానం పొందిన అతి పెద్ద ప్రజాస్వామిక భారత దేశంలో 705 ఆదివాసీ సమూహాలుగా 10.4 కోట్ల జనులు (జనాభాలో 8.6 శాతం) ఉన్నారు. ఆదివాసులను యస్టీలుగా వర్గీకరించిన ప్రభుత్వం అనేక ఆర్థిక సామాజిక సహాయాలను అందిస్తున్నది. ఇండియాలో రాజస్థాన్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధిక ఆదివాసీ జనాభా కేంద్రీకరించబడి ఉన్నది. సాధారణ సమాజానికి దూరంగా అణచి వేయబడిన గిరి పుత్రులకు మానవ హక్కులే తెలియవు. ఇలాంటి ఆదివాసీ జాతులు అటవీ ఉత్పత్తులనే జీవనోపాధులుగా బతుకుతున్నారు.

### తెలుగు రాష్ట్రాల ఆదివాసీలు :

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ముఖ్యమైన ఆదివాసీ తెగలు ఉన్నాయి. వీరిలో చెంచు, బోడో/గుటోబ గడబ, కొండ్, కోలమ్, కొండ రెడ్డి, కొండ సవర, పొరోజ, కోయ, తోటి, కమ్మర, జటపస్, కట్టునాయకన్, కొలావర్, మన్న దొర, లంబాడీ, యానాది, నక్కల, వాల్మీకి, బంజార, సుగాలీ, గుస్సాడి లాంటి అటవీ జాతులు వస్తాయి. తెలుగు రాష్ట్రాల ఆదివాసీలు అటవీ ప్రాంతాల్లో పోడు భూముల్లో వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సమీకరణల మీద ఆధారపడి జీవనోపాధిని పొందుతున్నారు. నల్లమల అటవీ ప్రాంతాల్లో పోడు సాగు చేస్తూ చెంచు జాతులు బతుకుదెరువు పొందుతున్నారు.

### పోడు సాగు సమస్య :

ఆదివాసీలు విలక్షణమైన అటవీ పుత్రులు. అమాయక గిరిపుత్రులు జనజీవన స్రవంతికి దూరంగా, అమానవీయ పరిసరాల్లో అడవి తల్లిని నమ్ముకొని అనాగరికంగా, అమాయకంగా బతుకుతుంటారు. అడవిలో కొంత భాగాన్ని కాల్చి వేసి వ్యవసాయ భూమిగా మార్చుకొని, హరిత సంపదను తొలగిస్తూ, కొద్ది ఏండ్లు పంటలు పండించుకుంటారు. దీనినే పోడు సాగు పద్ధతిగా పిలుస్తాం. పోడు వ్యవసాయం పేరుతో ప్రతి ఏట అడవులు నరకడం జరుగుతున్నదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లోనే వలసలు వెళుతూ, అటవీ సంపదను నరికి 'వలస సాగు' చేయడమే ఆదిలాబాద్, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, శ్రీకాకుళం లాంటి జిల్లాలకు చెందిన ఆదివాసీలకు జీవనాధారం అవుతున్నది. నేడు ఆదివాసులకు, అటవీశాఖ ఉద్యోగులకు మధ్య భయంకర యుద్ధమే జరుగుతున్నది. అడవులను నరికితే అనర్థాలు జరుగుతాయని, పోడు సాగుకు బదులు ఆదివాసులకు ప్రత్యామ్నాయ జీవనోపాధిని చూపాలనే సూచనలను విజ్ఞులు చేస్తున్నారు. బతుకుదెరువుకు, పర్యావరణ పరిరక్షణకు మధ్య నిత్య పోరు చూస్తున్నాం. ఆదివాసీల పక్షాన నిలుస్తున్న ఓటు బ్యాంకు రాజకీయ వ్యవస్థలు దీర్ఘకాలిక అనర్థాలను అర్థం చేసుకోక పోవడం విచారకరం. ఆదివాసీల హక్కులను కాపాడుతూ, అటవీ భూములను రక్షించుకుంటూ, మరో కరోనా లాంటి విపత్తు రాకుండా జాగ్రత్త పడాల్సిన కనీస కర్తవ్యం మనందరి మీద ఉన్నది. ఇలాంటి ఆదివాసీ జాతులకు డిజిటల్ యుగాన్ని పరిచయం చేస్తూ, వారి సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం, పౌర సమాజం నిరంతరం కృషి చేయాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037



# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై నిషేదాజ్ఞలు కొనసాగింపు

## -కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్ , ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): సాధారణ పౌరులు , ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 18 వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు . బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు . మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో , రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది . మద్యంప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడంతోపాటు ప్రజల భద్రత , రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది . పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది . ఐపిసి 188 , హైదరాబాద్ నగర పోలీసు చట్టం , ఫసలీ నిబంధనలనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది .

### డిజెలపై నిషేధాజ్ఞలు పొడగింపు

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 18 వరకు పొడగించడం జరిగిందని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ తెలిపారు . ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు . చిన్నపిల్లలు , వృద్ధులు , రోగులు , విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు విధించడం జరిగిందని పేర్కొన్నారు . వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ , ప్రదర్శనల కోసం డిజె సౌండ్లను వినియోగిస్తున్న విషయం విదితమే . వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఎసిపిల అనుమతి పొందాలని సూచించారు . ఏ ఏ ప్రాంతాల్లో ఏమేరకు ఏ స్థాయిలో మైక్సెట్లు వినియోగించాలో పరిమితులున్నాయని పేర్కొన్నారు . కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని , పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది . నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188 , హైదరాబాద్ నగర పోలీసుచట్టం , ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది .

# 1000 మందికి.. రూ.10 లక్షల స్టడీ మెటీరియల్ పంపిణీ

హైదరాబాద్, ఆగష్టు 8:మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు ఉచిత శిక్షణ శిబిరాల్లో 10 లక్షల రూపాయలతో 1000 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించారు. నియోజకవర్గంలోని చెన్నూరు, రామకృష్ణాపూర్ లలో జైపూర్ బెల్లంపల్లి ఏసీపీలు నరేందర్, మహేష్ లు అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ? ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్ ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పించారన్నారు. గడచిన వంద రోజులుగా బాల్క ఫౌండేషన్ వారి సహకారంతో మెరుగైన శిక్షణ ఇస్తున్నారన్నారు. బాల్క ఫౌండేషన్ ద్వారా ఉచిత స్టడీ మెటీరియల్ అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్ కు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# అకాసా ఎయిర్‌కి చెందిన ముంబై నుండి అహ్మదాబాద్ మొదటి విమానానికి జెండా ఊపిన శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా

న్యూఢిల్లీ, ఆగష్టు 8:పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా మరియు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి (రిటైర్డ్) వి కె సింగ్ ఈరోజు ముంబై నుండి అహ్మదాబాద్‌కు మొదటి అకాస ఎయిర్ (ఖీఖ1101) విమానాన్ని ప్రారంభించారు.

శ్రీ సింధియా, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, జనరల్ (డా.) వి.కె. సింగ్ (రిటైర్డ్.) శ్రీ రాజీవ్ బన్సల్, కార్యదర్శి, ఎం ఓ సి ఎ లతో కలిసి ఢిల్లీ లో ముంబై నుండి, ఆగస్ట్ 07, ఆదివారం ఉదయం 10:05 గంటలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం (టి 1) నుండి బయలుదేరిన అకాసా ఎయిర్ మొదటి విమానానికి జెండా ఊపారు. ఎం ఓ సి ఎ సహ కార్యదర్శి శ్రీమతి ఉషా పాధీ, అకాస ఎయిర్ వ్యవస్థాపకుడు శ్రీ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా, శ్రీమతి రేఖ జున్‌జున్‌వాలా మరియు ఆకాసా ఎయిర్ సీఈఓ మరియు వ్యవస్థాపకుడు శ్రీ వినయ్ దూబే, సహ వ్యవస్థాపకుడు మరియు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నీలు ఖత్రి అకాస ఎయిర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా మాట్లాడుతూ "ఈరోజు ప్రారంభమైన విమానం భారతదేశంలోని పౌర విమానయాన చరిత్రలో ఒక నవోదయం. ప్రధానమంత్రి దూరదృష్టి, లక్ష్యశుద్ధి మరియూ ఉత్సాహం కారణంగానే భారతదేశంలో మొదటిసారిగా పౌర విమానయాన ప్రజాస్వామ్యాన్ని మనం చూశాము.

ఇంతకుముందు పౌర విమానయానం చాలా ఖరీదైన ఉన్నత వర్గాలవారికి చెందిన పరిశ్రమ గా పరిగణించబడేది, కానీ ఇప్పుడు ప్రధాని భవిష్యదృష్టి కారణంగా గత ఎనిమిదేళ్లుగా చేరువ,అందుబాటు ధర, లభ్యత పరంగా మనం ఇంతకు ముందెన్నడూ చూడని పరివర్తనను చూస్తున్నాము. ఈ కొత్త నేపథ్యంలో నేను ఆకాశ ఎయిర్‌ని స్వాగతించాలనుకుంటున్నాను. రాబోయే రోజుల్లో ఆకాశ ఎయిర్ ఖచ్చితంగా తనదైన ముద్ర ను బలంగా వేస్తుందని నేను చాలా నమ్మకంగా ఉన్నాను".

"గత ఎనిమిదేళ్లలో భారతదేశ పౌర విమానయాన పరిశ్రమ ప్రధాని మోదీ నాయకత్వంలో పూర్తిగా రూపాంతరం చెందింది. ఉడాన్ పథకం కింద, మేము 1000 మార్గాలకు వెళ్లాలనే లక్ష్యంలో, ఇప్పటికే 425 మార్గాలను చేరుకున్నాం. 100 విమానాశ్రయాల లక్ష్యం లో 68 కొత్త విమానాశ్రయాలు వచ్చాయి. వచ్చే 4 సంవత్సరాల్లో భారతదేశంలో పౌర విమానయాన శాఖ ద్వారా 40 కోట్ల మంది ప్రయాణికులు విమానయానం చేస్తారని మేము ఆశిస్తున్నాము. రైలు రవాణా రోడ్డు రవాణాతో పాటు పౌర విమానయానం భారతదేశంలో రవాణాకు మరో మార్గం గా అవతరించే రోజు ఎంతో దూరంలో లేదు అని మంత్రి చెప్పారు.

పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి (జనరల్) డాక్టర్ వికె సింగ్ (రిటైర్డ్) కూడా అకాసా ఎయిర్‌ను అభినందించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ వీడియో సందేశం ఇచ్చారు.

ముంబైలో కార్పొరేట్ ప్రధాన కార్యాలయం గల అకాసా ఎయిర్ 7వ షెడ్యూల్ ఎయిర్‌లైన్ కు బోయింగ్ మ్యాక్స్ - 8 ఎయిర్‌క్రాఫ్ట్ ఉంది. దీనిని ఎస్ ఎన్ వి ఏవియేషన్ బ్రాండ్ పేరుతో వ్యవహరిస్తారు. అకాసా ఎయిర్ అన్ని ఎకానమీ సీట్లతో తక్కువ ధర తో ఒక విమానం వున్న కారియర్ . అకాసా ఎయిర్ తన కార్యకలాపాలను వచ్చే ఐదేళ్లలో 72 విమానాలకు విస్తరించాలని యోచిస్తోంది, ఇది భారతదేశంలో దేశీయ విమానయాన సేవలను గణనీయంగా పెంచుతుంది.

# పేదల కోసం పోరాడిన గొప్ప యోధుడు పండుగ సాయన్న- మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్ ఆగష్టు 8: పేదల కోసం పోరాడిన గొప్ప యోధుడు పండుగ సాయన్న అని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని వీరన్నపేటలో ఉన్న పండుగ సాయన్న దేవాలయంలో పండుగ సాయన్న జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ధనవంతులతో పోరాడి పేదలకు సాయం చేసిన తెలంగాణ రాబిన్ హుడ్ ను స్మరించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

పండుగ సాయన్న వారసులకు అన్ని విధాలా అండగా ఉంటామని? పండుగ సాయన్న ఖ్యాతిని మరింతగా పెంచే బాధ్యత తమపై ఉందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెమ్ జనార్ధన్, విక్రమ్ దేవ్, టీఆర్ఎస్ వి జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, శివరాజు, దోమ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ హైటెక్ సిటీలో స్వతంత్ర భారత వజ్రోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు ,అధికారులు

మహబూబాబాద్, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ హెచ్ఐసిసిలో ప్రారంభించే స్వతంత్ర భారత వజ్రోత్సవ కార్యక్రమంలో ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి తో కలిసి పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల ఎంపిపి ఈదురు రాజేశ్వరి, తొర్రూర్ మండల ఎంపిపి తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్,మునిసిపల్ చైర్మన్ మంగళపెల్లి రాంచంద్రయ్య, జిల్లా పరిషత్ సీఈఓ రమాదేవి, డిఎల్పిఓ శరబోద్దీన్ తదితరులు పాల్గొన్నారు...





# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి



అమరావతి, ఆగష్టు 8: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు చనిపోయారు. ఈ దుర్ఘటన కంభం సమీపంలో జరిగింది. సోమవారం తెల్లవారుజామున.. లారీని ఓ కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల నుంచి తిరుపతికి వెళ్తుండగా ఈ యాక్సిడెంట్ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు గ్రామస్థులుగా గుర్తించారు. మృతుల్లో అనిమిరెడ్డి (60), గురవమ్మ (60), అనంతమ్మ (55), ఆదిలక్ష్మి (58), నాగిరెడ్డి (24) ఉన్నారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారుగా పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఈడీపై కాంగ్రెస్ జైరాం రమేశ్ మండిపాటు

న్యూఢిల్లీ, ఆగష్టు 8:ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు సమన్లు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య కాంగ్రెస్‌ను కించపరిచే ప్రయత్నమని విమర్శించారు. రాజ్యసభ స్పీకర్, ప్రిసైడింగ్ అధికారిని అవమానించడం ఆపాలన్నారు. ఈ కేసులో ఖర్గే నిందితుడు కాదని, అయినప్పటికీ విచారణకు సహకరిస్తానని ఈడీకి హామీ ఇచ్చారని జైరాం రమేశ్ గుర్తు చేశారు.

అయితే, పార్లమెంట్ సమావేశాల జరుగని సమయంలో విచారణకు హాజరవుతారని చెప్పగా.. ఈడీ ఇందుకు అంగీకరించలేదు. పార్లమెంట్ సభ్యులను వేధింపుల నుంచి కాపాడాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్లకు జైరాం రమేశ్ విజ్ఞప్తి చేశారు. వైఐఎల్ కార్యాలయంలో శోధించడం, కేసులో ఆయన స్టేట్‌మెంట్‌ను నమోదు చేసేందుకు పిలువడం వెనుక కాంగ్రెస్, మల్లికార్జున ఖర్గేలను కించపరచడమే ఏకైక ఉద్దేశమని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా ఎంపీల గౌరవాన్ని, సంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఉభయ సభల ప్రిసైడింగ్ అధికారులు సంప్రదింపులు జరిపి పార్లమెంటును, ఎంపీలను ఇలాంటి అవమానాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.



# కరీంనగర్‌లో భారీ 'తిరంగా' ర్యాలీ..




కరీంనగర్ , ఆగస్టు 8: తపాల శాఖ కరీంనగర్ డివిజన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై, హర్ ఘర్ తిరంగా అంటూ నినాదాలు చేశారు. కరీంనగర్ హెడ్ పోస్టాఫీసు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ కలెక్టర్ బంగ్లా, ఆర్టీసీ బస్టాండ్, వన్ టౌన్ పోలీసు స్టేషన్, వెంకటేశ్వర దేవాలయం, కూరగాయల మార్కెట్, టవర్ సర్కిల్ మీదుగా తిరిగి పోస్టాఫీసుకు చేరింది.

ఈ సందర్భంగా కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 75వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత తపాల శాఖ హర్ ఘర్ తిరంగా పేరిట జాతీయ జెండాలను ఆఫ్ లైన్, ఆన్ లైన్ లో అమ్మాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించామని చెప్పారు. కరీంనగర్ డివిజన్ పరిధిలో 20వేల జెండాలను అమ్మాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 10 వేలకుపైగా జాతీయ జెండాలు విక్రయించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే డిమాండ్ ను బట్టి జాతీయ జెండాలను తెప్పిస్తామని అన్నారు. ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాలు అమ్ముతారని, సెలవు రోజులలో కూడా విక్రయాలు ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఎఎస్పీ సునీల్, ఐపీఓలు శ్రీనాథ్ రెడ్డి, రాజు, పోస్టు మాస్టర్ ఫజల్ రహమాన్ తో పాటు భారీగా పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ దారుణ హత్య.. దారికాచి నరికి చంపిన దుండగులు



అమరావతి, ఆగస్టు 8: ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కేంద్రం.. పట్టణ శివారులో ఓ కానిస్టేబుల్ దారుణ హత్యకు గురయ్యాడు, ఆదివారం రాత్రి అతను ఇంటికెళ్లే సమయంలో దారికాచి మరీ దారుణంగా కత్తులతో నరికి చంపినట్టు తెలుస్తోంది. కాగా మృతుడిపేరు సురేంద్రగా తెలుస్తోంది. నంద్యాల పట్టణంలోని రాజ్ థియేటర్ సమీపంలో సుమారు రాత్రి 10.30 గంటల సమయంలో కానిస్టేబుల్ సురేంద్ర ను కొందరు దుండగులు అటకాయించి ఆటోలో కిడ్నాప్ చేశారు. అక్కడ నుంచి పట్టణ శివారులోని చెరువుకట్ట ప్రాంతానికి తీసుకొని వెళ్లి కత్తులతో పొడిచి హత్య చేశారు.

ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన హత్య ఉదాంతంతో పోలీస్ శాఖ ఉల్లిక్కిపాటుకు గురైంది. విషయం తెలిసిన వెంటనే పోలీస్ శాఖ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే.. కానిస్టేబుల్ సురేంద్ర హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## జాతీయ గీతాలాపన



కరీంనగర్ , ఆగస్టు 8:భారత స్వతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా కరీంనగర్ లోని భగత్ నగర్ లో భగత్ సింగ్ విగ్రహం వద్ద సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ గీతాలపన చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ రవీందర్ సింగ్ తో పాటు స్థానిక ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



ఖమ్మం, ఆగస్టు 8 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామంలో ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంపెట సాయి, తుమ్మలపల్లి గోపి, కుటుంబలని పరామర్శించిన పెద్ద మునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, మృతుల కుటుంబాలకు అన్ని వేళలా అండగా తోడుగా ఉంటామని మనో ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో పెద్దగోపతి పొంగులేటి యూత్ అధ్యక్షుడు ఊటుకూరి రంజిత్, బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డు నరసింహారావు, మత్స్యకారుల శాఖ సెక్రెటరీ, దేవరకొండ కొండలు, మత్స్యకారుల శాఖ డైరెక్టర్, దుంపల కిషోర్, సాయి, కృష్ణ, వెంకట్, రవి, వంశీ, నాగరాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ డా.వినీత్.జి ఐపిఎస్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 08 (నేటినిజం ప్రతినిధి)సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఎస్పీ సందర్శించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని సీసీ కెమెరాలను వీలైనంత త్వరగా కమాండ్ కంట్రోల్ సెంటర్ నకు అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాలను నిత్యం పరిశీలించే విధంగా 24/7 కమాండ్ కంట్రోల్ సిబ్బంది పనిచేయాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలియజేశారు.



## ప్రాణం కాపాడగలగడం ఓ అదృష్టం - డాక్టర్ బంగారు స్వామి



హైదరాబాద్, ఆగస్టు 8:అపదలో ఉన్న వ్యక్తికి ప్రాణదానం చేయగలగడం ఓ అదృష్టమని, పలు ప్రమాదకర సందర్భాల్లో వ్యక్తుల ప్రాణాలు నిలుపుటకు 'బేసిక్ లైఫ్ సేవింగ్ ట్రేనింగ్' శిక్షణాకార్యక్రమం ఉపయోపడుతుందని రెని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా: బంగారి స్వామి అన్నారు. ఈ రోజు రెని ఆసుపత్రి సౌజన్యంతో సమాజ సేవకులు, పారామెడికల్ సిబ్బంది, పోలీసులు, పాఠశాల పీఈటీలు, అంబులెన్స్ డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత 'బేసిక్ లైఫ్ సేవింగ్ ట్రేనింగ్' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ గుండె ఆగిపోయిన సందర్భాల్లో వ్యక్తి ప్రాణాలు నిలుపుతూ సమీప ఆసుపత్రికి చేరే వరకు ఈ శిక్షణ దేహదపడుతుందని అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితం చాలా చిన్నదే అయినప్పటికీ సుందరమైందిగా ఉండటానికి మన కోసమే కాదు ఇతరుల కోసం కూడా కొంత సమయాన్ని కేటాయించాలని, సమాజంలో ప్రమాదకర స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తులకు ప్రాణదానం చేసే అవకాశం ఈ శిక్షణ ద్వారా మనకు లభ్యమవుతుందని అన్నారు. గుండె ఆగిన వెంటనే ఛాతిపై చేతులు ఉంచి కృత్రిమ శ్వాసను అందించే నైపుణ్యాలను అందరూ నేర్చుకోవాలని సూచించారు. డాక్టర్ ఉపెందర్ రెడ్డి, డాక్టర్ దీక్షిత్, డాక్టర్ కృష్ణారెడ్డి, లయన్ అరవింద్ బాబు, తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 50 మంది శిక్షణ పొంది ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆసియా , ఓషియానియా ప్రాంత ఐటియు రీజనల్ స్టాండర్డైజేషన్ ఫోరమ్ (ఆర్ ఎస్ ఎఫ్)ను ప్రారంభించిన శ్రీ దేవుసిన్హ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 8:ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ 2022 ఆగస్టు 8న న్యూఢిల్లీలో ఆసియా, ఓషియానియా ప్రాంత ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ రీజనల్ స్టాండర్డైజేషన్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) ను నిర్వహిస్తోంది. "టెలికమ్యూనికేషన్స్/ఐసిటిల రెగ్యులేటరీ, పాలసీ అంశాలు" అనే ఇతివృత్తం తో ఫోరమ్ జరుగుతుంది. ఫోరమ్ అనంతరం 2022 ఆగస్టు 09 నుంచి 2022 ఆగస్టు 12 వరకు ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్-టీ స్టడీ గ్రూప్ 3 రీజనల్ గ్రూప్ ఆసియా అండ్ ఓషియానియా (ఐటియు-టి ఎస్ జీ3ఆర్ జి-ఎఒ) నాలుగు రోజుల సమావేశం జరుగుతుంది.

రీజనల్ స్టాండర్డైజేషన్ ఫోరమ్ ను కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి శ్రీ దేవుసిన్హ్ చౌహాన్ రేపు ప్రారంభిస్తారు.

రీజనల్ స్టాండర్డైజేషన్ ఫోరమ్ ఆలోచనల నిర్మాణాత్మక మార్పిడికి ఒక వేదిక, సుస్థిరమైన డిజిటల్ మార్పు , ఐటియు ప్రమాణాల పాత్ర, వర్ధమాన మార్కెట్లలో డిజిటల్ ,ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కోసం టెక్నాలజీలనుఉపయోగించుకోవడం, డేటా వాల్యూ ఛైయిన్ , డిజిటల్ హెల్త్ వంటి వివిధ సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో భారతదేశ అనుభవంతో సహా ప్రామాణికీకరణ అంశాలను ఫోరమ్ చర్చిస్తుంది. పాలసీ , రెగ్యులేటరీ కోణం లో వివిధ ఉప-ఇతివృత్తాల కింద ఆసియా ,ఓషియానియా రీజియన్ అనుభవాల అంతర్దృష్టిని అందించడం లక్ష్యం గా ప్యానెల్ చర్చ జరుగుతుంది. రీజనల్ స్టాండర్డైజేషన్ ఫోరమ్ లో అకాడెమియా, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్ , ఐ సి టి , రంగం ,భారత ప్రభుత్వం నుంచి 15 మంది ప్రముఖ వక్తలు ప్రసంగిస్తారు, ఐ టి యు సభ్య దేశాలు, సెక్టార్ సభ్యులు, అసోసియేట్‌లు, విద్యాసంస్థలు, ఇంకా ఐ టి యు కార్యకలాపాలకు సహకరించాలనుకునే ఐ టి యు సభ్య దేశంలోని ఏ వ్యక్తి అయినా ఫోరమ్ లో పాల్గొనవచ్చు. అంతర్జాతీయ, ప్రాంతీయ జాతీయ సంస్థలలో సభ్యులుగా ఉన్న వ్యక్తులు కూడా ఇందులో ఉండవచ్చు. ప్రాంతీయ స్టాండర్డైజేషన్ ఫోరమ్ లో 20 దేశాల నుంచి 250 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారు.

అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో స్టాండర్డైజేషన్ పై తదుపరి పని కోసం ఐటియు-టి రీజనల్ గ్రూప్ ఆఫ్ ఆసియా ఓషియానియా తదుపరి సమావేశంలో ఆర్ ఎస్ ఎఫ్ లో చర్చల కీలక సూచనలు సమర్పించబడతాయి. డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ భారతదేశ వివిధ సృజనాత్మక డిజిటల్ ఉత్పత్తులు/సేవలను ప్రదర్శించడానికి ఈ ఫోరమ్ సందర్భంగా ఒక ఎగ్జిబిషన్ ను కూడా నిర్వహిస్తుంది.

ఈ ఫోరం తరువాత ఐటియు-టి స్టడీ గ్రూప్ 3 రీజనల్ గ్రూప్ ఆసియా అండ్ ఓషియానియా (ఐటియు-టి ఎస్ జీ3ఆర్ జి-ఎఒ) 09 ఆగస్టు 2022 నుండి 2022 ఆగస్టు 12 వరకు ఉంటుంది. ఐటియు-టి సభ్య దేశాలు సెక్టార్ సభ్యుల కోసం ఈ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో 130 మందికి పైగా పాల్గొంటారు. కోవిడ్-19 కారణంగా మూడు సంవత్సరాల విరామం తరువాత రీజనల్ గ్రూప్ ఆసియా ,ఓషియానియాల సమావేశం భౌతిక మోడ్ లో జరుగుతోంది.ఐటియు-టి స్టడీ గ్రూప్ 3 స్టాండర్డైజేషన్ వర్క్ కు దోహదపడటం , ఆసియా ,ఓషియానియా ప్రాంత ప్రయోజనాలను భద్రపరచడం ఈ సమావేశం లక్ష్యం.

రీజనల్ గ్రూప్ మీటింగ్ లో పాల్గొనే ప్రతినిధుల సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం "ప్రామాణికీకరణలో ప్రభావం" వర్క్‌షాప్‌పై బ్రిడ్జింగ్ ది స్టాండర్డైజేషన్ గ్యాప్ శిక్షణ ద్వారా సమావేశంప్రారంభమవుతుంది. దీనికి ఐటియు జెనీవాలోని అధ్యయన బృందాల అధిపతి డాక్టర్ బిలెల్ జమోస్సీ నాయకత్వం వహిస్తారు.

జెనీవా ప్రధాన కార్యాలయానికి చెందిన ఐటియు బృందంతో పాటు, ఆసియా పసిఫిక్ ప్రాంత ఐటియు రీజనల్ ఆఫీస్ డైరెక్టర్ శ్రీమతి అట్సుకా ఒకుడా కూడా ఈ కార్యక్రమాలకు హాజరవుతారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుపతి, ఆగస్టు 8: తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల పవిత్రోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని సంపంగి ప్రకారంలోని యాగశాలకు వేంచేపుచేశారు.ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సంపంగి ప్రాకారంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేస్తారని టీటీడీ అధికారులు తెలిపారు.

సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తామని వివరించా రు. కాగా పవిత్రోత్సవాల కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేశారు.



## జమ్మూ విశ్వవిద్యాలయంలో డోగ్రి భాషలో ప్రచురించిన జాతీయ సైన్స్ మాసపత్రిక "విజ్ఞాన్ జత్తారా"ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8:కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ డోగ్రి భాష లో ప్రచురించిన జాతీయ సైన్స్ మాసపత్రిక "విజ్ఞాన్ జత్తారా" ను జమ్మూ విశ్వవిద్యాలయం బ్రిగేడియర్ రాజిందర్ సింగ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక సహాయ (స్వతంత్ర బాధ్యత), భూ శాస్త్ర సహాయ (స్వతంత్ర బాధ్యత), సిబ్బంది వ్యవహారాలు,ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు. అణుశక్తి, అంతరిక్ష శాఖ ,మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆవిష్కరించారు. కాశ్మీరీ భాషలో కూడా పత్రిక త్వరలో అందుబాటులోకి వస్తుందని డాక్టర్ సింగ్ ప్రకటించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ జితేంద్ర సింగ్ స్థానిక ప్రాంతీయ భాషలో శాస్త్రీయ సమాచారం వ్యాప్తి జరిగేలా చూడాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆదేశించారని తెలిపారు. స్థానిక ప్రాంతీయ భాషలో శాస్త్రీయ సమాచారం అందుబాటులోకి వచ్చినప్పుడు ఇంగ్లీష్ లేదా హిందీ భాషల్లో అంతగా ప్రావీణ్యం లేని యువత ఎటువంటి సమస్యలు లేకుండా శాస్త్ర రంగంలో సులువుగా పోటీ పడి రాణించేందుకు అవకాశం కలుగుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. మాతృ భాషలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనేక మంది యువతీ యువకులు ఇటీవల కాలంలో జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపి రాణించడం దీనికి నిదర్శనమని మంత్రి అన్నారు.. బీఏ వరకు తన విద్యాభ్యాసమంతా తెలుగు మీడియంలో పూర్తి చేసిన ఒక యువకుడు ఐఏఎస్/సివిల్ సర్వీసెస్ పరీక్షలో .మొదటి అయిదు స్థానాలు సాధించిన వారిలో ఒకరిగా నిలవడం దీనికి ఉదాహరణగా డాక్టర్ జితేంద్ర సింగ్ ఉటంకించారు.

కార్యక్రమంలో జమ్మూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ రాయ్, జమ్మూ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సంజీవ్ జైన్ మరియు జమ్మూ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ మాజీ విభాగాధిపతి ప్రముఖ డోగ్రీ రచయిత కూడా అయిన ప్రొఫెసర్ లలిత్ మంగోత్రా ప్రసంగించారు. ఉత్తర భారతదేశ విద్యా కేంద్రంగా జమ్మూని అభివృద్ధి చేసేందుకు డాక్టర్ జితేంద్ర సింగ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఇతర భాషలతో పాటు డోగ్రీ భాషలో కూడా సైన్స్ విద్యను ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న చర్యలను వారు ప్రశంసించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జ్ఞానం మరియు పురోగతి ఆధారంగా ప్రపంచం అభివృద్ధి సాధిస్తున్న నేపథ్యంలో దేశ యువతకు తగిన పాఠ్యాంశాలు, సాహిత్యం మరియు వారికి నచ్చిన భాషలో సైన్స్ అధ్యయనం చేయడానికి అవకాశాలు కల్పించాలని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు ఇంగ్లీష్ లేదా హిందీ మీడియం. విద్యార్థులతో పోటీ పడటానికి విద్యార్థులకు తగిన పాఠ్యాంశాలను అందుబాటులోకి తేవాలని అన్నారు.

స్థానిక ప్రాంతీయ భాషలకు ఇతర భాషలతో సమానంగా ప్రాధాన్యత ఇవ్వలన్న గట్టి పట్టుదలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉన్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. దీనికి నిదర్శనం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రమని మంత్రి అన్నారు.ఆగస్టు 5, 2019 తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ప్రకారం ఐదు భాషలు.. ఇంగ్లీష్, హిందీ,ఉర్దూ,డోగ్రి, కాశ్మీరీ అధికార భాషలుగా గుర్తింపు పొందాయని మంత్రి అన్నారు. అయిదు అధికార భాషలు కలిగి ఉన్న ఏకైక రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతంగా జమ్మూ కాశ్మీర్ ఘనత సాధించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు.

శాస్త్ర రంగంలో రాణించేందుకు భాష ఆటంకం కాదని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. భాషకు, శాస్త్ర రంగానికి ఏ మాత్రం సంబంధం లేదని ఆయన అన్నారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన లేకుండానే రష్యా, జపాన్, చైనా దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగడం దీనికి నిదర్శనమని అన్నారు. భారతదేశంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. దీనికి కారణం విద్యపై లార్డ్ మెకాలే రూపొందించిన విధానాన్ని దాదాపు రెండు దశాబ్దాల పాటు అమలు చేయడమే దీనికి కారణమని అన్నారు. లార్డ్ మెకాలే విధానం వల్ల ముఖ్యమైన పాఠ్యపుస్తకాలు మరియు సాహిత్యం ఎక్కువగా ఇంగ్లీషులో మాత్రమే అందుబాటులో ఉన్నాయని అన్నారు.విద్యార్థులు కూడా వాటినే చదవాల్సి వచ్చిందని అన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంగ్లీషులో ఉన్న సైన్స్ పాఠ్య పుస్తకాలను భావం, అంశాలు చెడకుండా డోగ్రి భాషలో అనువదించడానికి సహకారం అందించాలని ఆయన శాస్త్రీయ అంశాలపై పట్టు కలిగిన డోగ్రీ స్కాలర్లు ముందుకు రావాలని మంత్రి కోరారు. డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ,ప్రపంచంలో భారతదేశం అగ్ర స్థానానికి చేరుకోవడానికి రాబోయే 25 సంవత్సరాల కాలం అబ్బుత అవకాశం అందిస్తుందని పేర్కొన్న డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ 25 సంవత్సరాల కాలాన్ని అమృత కాలంగా వర్ణించారు. శాస్త్రీయపరమైన నైపుణ్యాలు, సాంకేతిక ఆధారిత స్టార్టప్‌ల సామర్థ్యంపై ఆధారపడి భారతదేశం అగ్ర స్థానానికి చేరుతుందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని 2047 సంవత్సరం వరకు పూర్తి సామర్థ్యం కలిగి మరో 25 సంవత్సరాల పాటు సేవలు అందించగల 30 ఏళ్ల వయస్సులో ఉన్న యువత, ఉన్న స్టార్టప్‌లు శాస్త్రీయ సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించి పనిచేయాలని మంత్రి అన్నారు. మాట్లాడే లేదా చదివే భాషతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఇవ్వాలని ఐన్ అన్నారు.శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రైవేట్ రంగానికి అంతరిక్ష రంగాన్ని అందుబాటులోకి తేవడం, అణుశక్తి రంగంలో జాయింట్ వెంచర్లు అమలు అనుమతించమని మంత్రి తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. దేశంలో అతి తక్కువ సమయంలో 100 యునికార్న్‌లతో 75,000 స్టార్టప్‌లు ఏర్పాటు కావడం దేశం సాధిస్తున్న ప్రగతికి నిర్దర్శనమని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. భారతీయ భాషల్లో సైన్స్ కమ్యూనికేషన్ మరియు విద్యను ప్రోత్సహించడం ప్రస్తుత ప్రభుత్వం యొక్క ముఖ్యాంశాలలో ఒకటి అని మంత్రి చెప్పారు, విద్యార్థులకు స్థానిక భాషలలో సైన్స్ పాఠ్య పుస్తకాలను అందుబాటులో తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. నిపుణుల బృందానికి భారతీయ భాషల్లో సైన్స్ కమ్యూనికేషన్ మరియు విద్య అంశాలను అందుబాటులోకి తెచ్చే బాధ్యత అప్పగించినట్లు ఆయన చెప్పారు. కాశ్మీర్ సెంట్రల్ యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డోగ్రీ లాంగ్వేజ్‌కి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ జితేంద్ర సింగ్ సైన్స్ మ్యాగజైన్‌ను డోగ్రీ భాషలో ప్రభావవంతంగా అనువదించడానికి సహకారం అందించాలని కోరారు.రష్యా, జపాన్, జర్మనీ, చైనా వంటి అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు తమ మాతృభాషల్లో అత్యుత్తమ సైన్స్ సాహిత్యం మరియు ప్రాజెక్టులను కలిగి ఉన్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. భారతదేశం కూడా అన్ని భారతీయ భాషలలో ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలకు ప్రాచుర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని మంత్రి అన్నారు. మాతృభాషలో విద్య బోధన జరిగినప్పుడు ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేసేందుకు వీలవుతుందని అన్నారు.2021 డిసెంబర్ లో డాక్టర్ జితేంద్ర సింగ్ న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్ లో సైన్స్ మాసపత్రికను హిందీ, ఉర్దూ మరియు ఇంగ్లీషు భాషల్లో విడుదల చేశారు.

## రజకులకు ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలి...

### -మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా

రజకులకు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పున్నం సారయ్య డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో వెంకటరమణకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. అనంతరం వారిని ఉద్దేశించి సంఘం జిల్లా నాయకులు పున్నం సారయ్య, దుగ్గి లక్ష్మీనారాయణ లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రజక వృత్తిదారుల సమస్యలపై ఆగస్టు "8"న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని,రజక బందు ఏర్పాటు చేసి, రూ: 10 లక్షలు రుణం అందించాలని ,మోడ్రన్ దోబీ ఘాట్ ల నిర్మాణానికి స్థలం కేటాయించి ప్రభుత్వ నిర్మించి వాళ్ళని వారి సందర్భంగా కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో వృత్తి పనిని, కాంట్రాక్టుగా రజక వృత్తిదారులకు ఇవ్వాలని,నూతన రజక సొసైటీ లో రిజిస్ట్రేషన్ లు వెంటనే ఆన్లైన్లో చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. .డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రజక వృత్తిదారుల కి ఇవ్వాలి, రజకుల ఉచిత విద్యుత్ పథకాన్ని , అపార్ట్మెంట్ వాచ్మెన్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని , ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు తమ అడ్రస్ మార్పు ఎడల విద్యుత్ అధికారులు జోక్యం చేసుకుని లబ్ధిదారులు కోరిన చోట విద్యుత్ మీటర్లు బిగించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రజకులకు" 5" లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం చేయాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులందర్నీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్, జిల్లా నాయకులు నిమ్మల సోమయ్య, పొదుపు గంటి శేఖర్, వడ్డేపల్లి రాంబాబు, మచ్చ యాకన్న, జీడిమెట్ల శ్రీనాథ్ మడిపెద్ది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ ,ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులు

# 7408 మిలియన్ డాలర్లతో 31 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ, ఆగష్టు 8:గత ఏడాది ధోరణిని కొనసాగిస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23 మొదటి మూడు నెలల (ఏప్రిల్-జూన్) లో వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులు 2021-22 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 31 శాతం పెరిగాయి.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డిజిసిఐ అండ్ ఎస్) విడుదల చేసిన తాత్కాలిక డేటా ప్రకారం, ఎపిఇడిఎ ఉత్పత్తుల మొత్తం ఎగుమతి 2022 ఏప్రిల్-జూన్ లో 7408 మిలియన్ డాలర్లకు పెరిగింది. 2022-23 ఏప్రిల్-జూన్ లో ఎగుమతి లక్ష్యాన్ని 5890 మిలియన్ డాలర్లుగా నిర్ణయించారు.

వాణిజ్య ,పరిశ్రమల మంత్రిత్వ శాఖ కింద పనిచేసే వ్యవసాయ ,ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్ పోర్ట్ డెవలప్మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) చేపట్టిన చొరవలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం ఎగుమతి లక్ష్యంలో తొలి మూడు నెలలలో 31 శాతం సాధించడంలో దేశానికి సహాయపడ్డాయి.

2022-23 సంవత్సరానికి, వ్యవసాయ ,ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల కు అపెడా 23.56 బిలియన్ డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని నిర్ణయించింది. డిజిసిఐ అండ్ ఎస్ తాత్కాలిక డేటా ప్రకారం, తాజా పండ్లు ,కూరగాయలు నాలుగు శాతం వృద్ధిని నమోదు చేశాయి, ప్రాసెస్ చేసిన పండ్లు ,కూరగాయలు గత సంవత్సరం ఇదే నెలలతో పోలిస్తే 59.71 శాతం (ఏప్రిల్-జూన్ 2022) గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి.

అలాగే, తృణధాన్యాలు , ఇతర ప్రాసెస్ చేసిన వస్తువులు వంటి ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులు గత సంవత్సరం మొదటి త్రైమాసికంతో పోలిస్తే 37.66 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

2021 ఏప్రిల్-జూన్ లో తాజా పండ్లు, కూరగాయలు 394 మిలియన్ డాలర్ల ఎగుమతి చేయబడ్డాయి, ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే నెలల్లో 409 మిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రాసెస్ చేసిన ఎఫ్ అండ్ వి ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ లో 490 మిలియన్ డాలర్లకు పెరిగాయి, ఇవి గత సంవత్సరం ఇదే నెలలో 307 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

బాస్మతి బియ్యం ఎగుమతులు 2022-23 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 25.54 శాతం వృద్ధిని నమోదు చేశాయి, దాని ఎగుమతులు 922 మిలియన్ డాలర్లు (ఏప్రిల్-జూన్ 2021) నుండి 1157 మిలియన్ డాలర్లకు (ఏప్రిల్-జూన్ 2022) పెరిగాయి, బాస్మతియేతర బియ్యం ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 1566 మిలియన్ డాలర్లకు పెరిగి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ 1 లో 5 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

మాంసం, పాడి ,పౌల్ట్రీ ఉత్పత్తుల ఎగుమతి 9.5 శాతం పెరిగింది. ఇతర తృణధాన్యాల ఎగుమతి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ 1 లో 29 శాతం వృద్ధిని నమోదు చేసింది. కేవలం పాల ఉత్పత్తులే ఎగుమతుల లో 67.15 శాతం వృద్ధిని నమోదు చేశాయి, వాటి ఎగుమతి గత ఏడాది తొలి త్రైమాసికంలో 114 మిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 191 మిలియన్ డాలర్లకు పెరిగింది.

ఇతర తృణధాన్యాల ఎగుమతులు 2021 ఏప్రిల్-జూన్ లో 237 మిలియన్ డాలర్ల నుండి 2022-23 ఏప్రిల్-జూన్ లో 306 మిలియన్ డాలర్లకు పెరిగాయి పశువుల ఉత్పత్తుల ఎగుమతి 2021 ఏప్రిల్-జూన్ లో 1022 మిలియన్ డాలర్ల నుండి 2022 ఏప్రిల్-జూన్ లో 1120 మిలియన్ డాలర్లకు పెరిగింది.

"దేశం నుండి ప్రత్యేక ఉత్పత్తుల ఎగుమతులను పెంచడానికి వ్యవసాయ వస్తువుల విలువ గొలుసులలోని వివిధ వాటాదారులకు సాంకేతిక ,ఆర్థిక సహాయ సహకారాలను అందించడం కొనసాగిస్తున్నాము" అని అపెడా చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు చెప్పారు.

డిజిసిఐ అండ్ ఎస్ డేటా ప్రకారం 2021-22లో దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 19.92 శాతం పెరిగి 50.21 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2020-21లో సాధించిన 41.87 బిలియన్ డాలర్లతో వృద్ధి రేటు 17.66 శాతం పైగా ఉంది. అధిక సరుకు రవాణా రేట్లు ,కంటైనర్ కొరత వంటి రూపాల్లో అపూర్వమైన లాజిస్టిక్ సవాళ్లు ఉన్నప్పటికీ ఇది సాధ్యం కావడం విశేషం.

2021-22లో వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులను 25.6 బిలియన్ డాలర్లకు ఎగుమతి చేయడం ద్వారా అపెడా కొత్త చరిత్రను లిఖించింది. ఇది భారతదేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 50 పైగా బిలియన్ డాలర్లతో 51 శాతం ఉంది.

"వ్యవసాయ ఎగుమతుల విలువ గొలుసులలో కీలక వాటాదారుల సహకారంతో అవసరమైన పర్యావరణ-వ్యవస్థ ఎగుమతులను సృష్టించడం ద్వారా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా భారతదేశ వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఎగుమతులలో వృద్ధిని కొనసాగించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము" అని అంగముత్తు చెప్పారు.

వ్యవసాయ ,ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులలో పెరుగుదల- వివిధ దేశాలలో బి 2 బి ఎగ్జిబిషన్లను నిర్వహించడం, భారతీయ రాయబార కార్యాలయాల క్రియాశీల భాగస్వామ్యంతో ఉత్పత్తి-నిర్దిష్ట సాధారణ మార్కెటింగ్ ప్రచారాల ద్వారా కొత్త సంభావ్య మార్కెట్లను అన్వేషించడం వంటి అపెడా చేపట్టిన వివిధ చొరవల ఫలితమే.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తో వ్యవసాయ, ఆహార ఉత్పత్తులపై , హస్తకళలతో సహా జిఐ ఉత్పత్తులపై. అమెరికా తో వర్చువల్ బయ్యర్ సెల్లర్ మీట్ లను నిర్వహించడం ద్వారా, భారతదేశంలో రిజిస్టర్డ్ జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జిఐ) ఉన్న ఉత్పత్తులను ప్రోత్సహించడానికి కూడా అపెడాఅనేక చొరవలు తీసుకుంది,

జూన్ 7 నుంచి 9, 2022 వరకు జరిగిన లండన్ వైన్ ఫెయిర్లో 10 మంది వైన్ ఎగుమతిదారులు పాల్గొనేందుకు ఏపీఈడీఏ అవకాశం కల్పించింది.

ఈశాన్య రాష్ట్రాల నుంచి సహజ, సేంద్రియ, జిఐ-వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించడంపై అపెడా ఇటీవల అస్సాంలోని గౌహతిలో ఒక సమావేశాన్ని నిర్వహించింది. అస్సాం పొరుగు రాష్ట్రాలలో పండించే సహజ, సేంద్రియ, జిఐ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్ లింకేజీలను సృష్టించడం ఈ సదస్సు లక్ష్యం.

కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్ సహకారంతో, అపెడా ఇటీవల అంతర్జాతీయ కొనుగోలుదారు విక్రేతల సమావేశాన్ని నిర్వహించింది, ఇది లద్దాఖ్ నుండి ఆప్రికాట్లు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచడానికి లక్ష్యంగా పెట్టుకుంది. లద్దాఖ్ ,జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పద్దెనిమిది మంది పారిశ్రామిక వేత్తలు ఇందులో ఆప్రికాట్లు ,ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. భారత్, అమెరికా, బంగ్లాదేశ్, ఒమన్, దుబాయ్ నుంచి 20 మంది కొనుగోలుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అపెడా జూన్ 13 న బహ్రెయిన్ లో ఎనిమిది రోజుల మ్యాంగో ఫెస్టివల్ ను ప్రారంభించింది. పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఒడిశా సహా తూర్పు రాష్ట్రాలకు చెందిన 34 రకాల మామిడి పండ్లను బహ్రెయిన్ లోని అల్ జజీరా గ్రూప్ సూపర్ మార్కెట్ లో ప్రదర్శించారు.

"మ్యాంగో ఫెస్టివల్ 2022' కింద భారతీయ మామిడి పండ్లకు అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించడానికి అపెడా తీసుకున్న కొత్త చొరవలో భాగంగా బహ్రెయిన్ లో మామిడి ప్రదర్శన నిర్వహించారు. భారతీయ మామిడి పండ్లకు ఒక ప్రపంచ వేదికను అందించడానికి అపెడా నిబద్ధత కు ఇది నిదర్శనం. తూర్పు రాష్ట్రాల నుండి 34 రకాల మామిడి పండ్ల ను బహ్రెయిన్ లోప్రదర్శించారు. ఇంతకు ముందు దక్షిణాది రాష్ట్రాల నుంచి అల్ఫోన్సో, కేసర్, బంగన్ పల్లి మొదలైన రకాల మామిడి పండ్లను ఎక్కువ గా అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించేవారు. .

# వేములవాడ రాజన్నఆలయానికి పోటెత్తిన భక్తజనం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం శ్రావణమాసం సోమవారం సందర్భంగా భక్తులతో పోటెత్తింది. వేకువ జాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి తమ కోడెమొక్కు తీర్చుకున్నారు.ఆలయ ప్రాంగణంలో గల కల్యాణకట్టలో భక్తులు తలనీలాల సమర్పించారు.నిలువెత్తు బెల్లాన్ని భక్తులకు పంచిపెట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులు గర్భగుడిలో నిర్వహించుకునే ఆర్థిక సేవలైన అభిషేక పూజలు, అన్న పూజలు, ఆకుల పూజలను ఆలయ అధికారులు రద్దు చేశారు. దీంతో భక్తులు లఘు దర్శనం చేసుకున్నారు.

ఆలయ కళాభవన్లో భక్తులు కల్యాణాల మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు, చండీ హోమాలు ఘనంగా నిర్వహించారు .రాజన్న అనుబంధ దేవాలయాలైన శ్రీ భీమేశ్వరాలయం, నగరేశ్వరాలయం, బద్ది పోచమ్మ దేవాలయాల్లో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు.

రాజన్నను దాదాపు 50 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని రాజన్నకు సుమారు రూ.24 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# మినీ ట్యాంక్బండ్ పనులు వేగవంతం చేయాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబాబాద్, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మినీ ట్యాంక్ బండ్ చుట్టూ ఏర్పాటు చేస్తున్న నెక్లెస్ రోడ్డు, బ్రిడ్జి పనులు ఆగకుండా చేపట్టాలని ఆయన సూచించారు.

అంతకుముందు అల్మాస్ ఫంక్షన్ హాల్ సమీపంలో వరద పరిస్థితిలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట మునిసిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, అధికారులు ఉన్నారు.

75 స్వతంత్ర భారత వజ్రోత్సవాలు తెలంగాణ రాష్ట్రం

# ఐఐటీ జేఈఈ మెయిన్ ఫలితాలలో అల్ఫోర్స్ "కు జాతీయ స్థాయిలో ర్యాంకుల పంట



కరీంనగర్ , ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): సోమవారం ప్రకటించబడిన ఐ ఐ టి జీ ఈ ఈ మెయిన్ – 2022 ఫలితాలలో అల్ఫోర్స్ ।విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు . డి.సదాశివరెడ్డి జాతీయస్థాయి 242 ర్యాంకు సాధించగా , భూక్యా మణికంట 375 ర్యాంకు , ఆర్.రిష్మిత 487 ర్యాంకు , డి . విశ్వనాథెడ్డి 577 ర్యాంకు , వి.రామ్ ప్రణీత్ 597 ర్యాంకు , యమ్ . సాత్విక్ 607 ర్యాంకు , సి.హెచ్ . నిషాంత్రెడ్డి 673 ర్యాంకు , పి.సాయికాశిక్ 730 ర్యాంకు , పి.సాయిశరణ్ 845 ర్యాంకు , పి . సిద్దార్థ 1019 ర్యాంకు , బి . నవదీప్ 1382 ర్యాంకు , టి . వెంకటచరణారావు 1655 ర్యాంకు , కె.ఆర్య 1656 ర్యాంకు , రూపాసింగ్ 2005 ర్యాంకు , కె.వి.వి.ఎస్.ఎస్.రేష్మిత 2080 ర్యాంకు , సి.హెచ్ . రాజవిష్ణున్ష్ 2088 ర్యాంకు , సి.హెచ్ . సుప్రీమ్ 2090 ర్యాంకు , ఏ . భార్గవ్రెడ్డి 2091 ర్యాంకు , డి . ఆపూర్వ 2240 ర్యాంకులు సాధించారు , 28 మంది విద్యార్థులు 5,000 లోపు ర్యాంకులు మరియు 401 మంది అల్ఫోర్స్ విద్యార్థులు ఐ.ఐ.టి ఆడ్వాన్స్ పరీక్ష వ్రాయుటకు అర్హత సాధించండం విశేషం . పటిష్ట ప్రణాళికతో విద్యాభోధన , విద్యార్థుల అహర్నిషల కృషి మరియు అల్ఫోర్స్ నిరంతర పర్యవేక్షణ వల్ల ఇంతటి ఘన విజయం సాధించగలిగామని అల్ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్ రెడ్డి తెలిపారు . రాబోయే । నీట్ , ఎంసెట్ ఫలితాలలో కూడ మా అల్ఫోర్స్ విద్యార్థులు అఖండ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు . అద్భుత ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ ఆణిముత్యాలను వారి తల్లిదండ్రులకు ఈ విజయానికి తోడ్పడిన । అధ్యాపక , అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు .

# మోదీ నాయకత్వంలో దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం

**విద్యుత్ ఉద్యోగులతో పెట్టుకుంటే మోదీ ప్రభుత్వానికి త్రీఫేజ్ షాక్ కొట్టడం ఖాయం**

**విద్యుత్ ఉద్యోగులకు ఎంఐఎం పార్టీ సంఘీభావం**



కరీంనగర్ , ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలనే ప్రధాన డిమాండ్ తో నేడు నగరంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష కార్యక్రమానికి ఎంఐఎం పార్టీ నాయకులు హాజరై..ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా హాజరైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంఐఎం ఇంచార్జ్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ ఉద్యోగులతో పెట్టుకుంటే మోదీ ప్రభుత్వానికి షాక్ కొట్టడం, ప్రభుత్వం కూలడం ఖాయమని జోస్యం చెప్పారు. విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పనిలో భద్రత కల్పించాలని, విద్యుత్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయడంతో పాటు విద్యుత్ రంగంలో ప్రైవేటు కంపెనీల దోపిడిని అరికట్టాలని, విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకొని, 2014 కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును నిలిపివేయాలనే న్యాయమైన డిమాండ్లతో విద్యుత్ ఉద్యోగులు చేపడుతున్న దీక్షకు ఎంఐఎం పార్టీ పక్షాన సంఘీభావం ప్రకటిస్తూ, వారి డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, నాయకులు అలిబాబా, అజర్ దబీర్, కాజమ్ అలీఖాన్, సాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంగ్రామ యాత్రను జయప్రదం చేయండి

మహబూబాబాద్, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): ి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన మూడో విడత పాదయాత్ర-ప్రజా సంగ్రామ యాత్ర ఈనెల 14,15,16 తేదీలలో పాలకుర్తి నియోజకవర్గంలో జరుగుతుందని బీజేపీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రజాసంగ్రామ యాత్ర నియోజకవర్గ ఇన్చార్జి లేగా రాం మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.తొర్రూరు లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర కు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం తెలుపుతున్నారని తెలిపారు. కేసీఆర్ సర్కారు నియంతృత్వ నిరంకుశ అహంకార పాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో పేదల ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర కొనసాగుతుంది అని తెలిపారు.రాష్ట్రంలో రోజురోజుకూ బీజేపీ పుంజుకుంటుందని అని తెలిపారు.కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీ అయిన తెలంగాణ తల్లికి బీజేపీ నేతృత్వంలో విముక్తి కాబోతుంది అని తెలిపారు.పాలకుర్తి నియోజకవర్గం లో జరిగే పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు,దుబ్బ రాజశేఖర్, తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సురేష్,పెదవంగర మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన సుధాకర్, జిల్లా ,మండల నాయకులు చింతా స్రుజన్,పైండ్ల రాజేష్,కాగు నవీన్, నూకల నవీన్,మచ్చ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన యూనివర్సిటీ మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించి తరగతులు ప్రారంభినించాలి

**-రైతులకు ఏక కాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయాలి**

**-పెండింగ్ లో ఉన్న పెన్షన్లు తో పాటు రేషన్ కార్డులు మంజూరు చేయాలి**

**-బస్ డిపో హామీ ఏమైంది ముఖ్య మంత్రి కెసిఆర్**

**-ముఖ్య మంత్రి కెసిఆర్ ఇచ్చిన మాట ప్రకారం మల్లంపల్లి మండలం చేయాలి-జిల్లా అధ్యక్షులు నల్లేల కుమారస్వామి**

ములుగు, ఆగష్టు 8 (నేటినిజం ప్రతినిధి)ఈ రోజు ములుగు జిల్లా కేంద్రములో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పోకడలతో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు అనిముఖ్య మంత్రి కెసిఆర్ హామీలు ఇవ్వడం తప్పా అమలు చేయడం లేదని ఎన్నికల సమయం లో రైతులకు ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తాం పండించిన పంట కొనుగోలు చేస్తామనినిరుపేదలకు డబుల్ బెడ్ రూం లు కట్టించి ఇస్తామని నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 3016 లు ఇస్తామని కేజీ టూ పిజి ఉచిత నిర్బంధ విద్య అని ఇలా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ ఏ ఒక్క హామీ నెరవేర్చ లేదని గడిచిన 4యేండ్ల నుండి ఒక్క పెన్షన్,రేషన్ కార్డు కూడా ఇవ్వలేని పరిస్థితి ఈ రాష్ట్రం లో ఉందని కేంద్ర ప్రభుత్వం విభజన హామీ ప్రకారం ములుగు జిల్లా కేంద్రములో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీ పనులు ప్రారంభించాలి అని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించాలి కేంద్ర ప్రభుత్వం పేదల పై పెంచిన పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ ధరలు తగ్గించాలని లేని యెడల ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తామని ఆయన తీవ్ర స్థాయిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై ధ్వజమెత్తారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాం రెడ్డియూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బై రెడ్డి బాగ్ వాన్ రెడ్డి,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా,వర్కింగ్ కమిటీ అధ్యక్షులు బండి శ్రీనివాస్రసుపుత్ సీతారాం నాయక్ఎంపీటీసీ మవురపు తిరుపతి రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి,కిసాన్ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శి నునేటి శ్యామ్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వంశీ కృష్ణ,ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మామిడి శెట్టి కోటి,సీతక్క యువసేన మండల అధ్యక్షులు చర్ప రవీందర్,మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆజ్జు సహకార సంఘం డైరెక్టర్ సాంబయ్య,నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి.. జిల్లా కలెక్టర్ సంగీత



కరీంనగర్ , ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): ప్రజా సమస్యల కొరకే ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. సంగీత సత్యనారాయణ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో సోమవారం ప్రజల వద్ద నుంచి అర్జిలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుండి పలు వినతులు అందినట్లు తెలిపారు. ప్రజల నుండి వినతులను స్వీకరించి సంబంధిత శాఖలకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన అధికారులతో కలెక్టర్ ఫోన్లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# పీవీ సింధును అభినందించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, ఆగష్టు 8 (నేటినిజం ప్రతినిధి): బర్మింగ్హామ్లో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో స్వర్ణం సాధించిన పీవీ సింధు ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందించారు. కామన్వెల్త్ క్రీడల్లో షట్లర్ పీవీ సింధు, యువ బాక్సర్ నిఖత్ జరీన్ లు తమ సత్తా చాటి పసిడి పతకాలు గెలవడం దేశానికి గర్వ కారణమని అన్నారు. స్వర్ణ పతకాన్ని సాధించిన వారిద్దరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 10వ తేదీన మేడ్చల్లో జాబ్ మేళా

మేడ్చల్, ఆగస్ట్ 8(నేటినిజం ప్రతినిధి):గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 10తేదీన ఉదయం 10:30 గంటలకు మేడ్చల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ వీర్లపల్లీ రజిత రాజమల్లరెడ్డి అన్నారు.సోమవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు.ఆసక్తి గల యువతకు వివిధ సంస్థలు ఫార్మా , స్కిల్స్ అండ్ మార్కెటింగ్,రవాణా, ఆటోమొబైల్,సెక్యూరిటీ అండ్ హౌస్ కీపింగ్ తదితర రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఎంపీపీ పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయసుగల యువతి యువకులు పదవ తరగతి, ఇంటర్ ,డిగ్రీ, పిజి విద్య అర్హత గల వారు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు..



# రాజకీయాల్లోకి వచ్చే ప్రసక్తే లేదు : రజనీకాంత్

చెన్నై, ఆగష్టు 8: రాజకీయ అరంగ్రేటంపై సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి క్లారిటీ ఇచ్చారు. రాజకీయాల్లోకి వచ్చే ప్రసక్తే లేదని సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిసిన అనంతరం రజనీకాంత్ మీడియాతో మాట్లాడారు.

గవర్నర్‌తో 25 నుంచి 30 నిమిషాల పాటు మాట్లాడానని తెలిపారు. ఆర్ఎన్ రవి ఎక్కువ కాలం ఉత్తరాదిలోనే గడిపారు. అయితే ఆయన తమిళనాడుతో పాటు ఇక్కడి ప్రజలను ప్రేమిస్తారని చెప్పారు. తమిళుల కష్టాన్ని, నిజాయితీని గవర్నర్ ఇష్టపడుతారని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా, ఇక్కడి ఆధ్యాత్మికత అంటే ఆయనకు ఎంతో ఇష్టమన్నారు. తమిళనాడు సంక్షేమం ఏదైనా చేయడానికి సిద్ధమని రవి తనతో చెప్పారని రజనీకాంత్ స్పష్టం చేశారు.

ఇక రాజకీయాలు కూడా చర్చకు వచ్చాయన్న రజనీకాంత్.. ఆ విషయాలను మీడియాకు వెల్లడించడం సరికాదన్నారు. అయితే భవిష్యత్‌లో తాను రాజకీయాల్లోకి వచ్చే ప్రసక్తే లేదని సూపర్‌స్టార్ తేల్చిచెప్పారు. పాలు, పెరుగుతో పాటు ఇతర పదార్థాలపై జీఎస్టీ విధించడాన్ని మీరేలా చూస్తారని రజనీకాంత్‌ను మీడియా ప్రశ్నించగా.. నో కామెంట్ అని బదులిచ్చారు.

తాను నటించబోయే జైలర్ మూవీ షూటింగ్ ఆగస్టు 15 లేదా 22వ తేదీన ప్రారంభిస్తున్నట్లు రజనీకాంత్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీని స్థాపించి, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని 2017లో రజనీకాంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ 2020, డిసెంబర్‌లో సూపర్‌స్టార్ సంచలన ప్రకటన చేశారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. కొవిడ్ వ్యాపించడంతో పాటు ఇతర ఆరోగ్య కారణాల రీత్యా రాజకీయ ప్రవేశం చేయడం లేదని నాడు రజనీకాంత్ స్టేట్‌మెంట్ ఇచ్చారు.

## శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునుడి సేవలో మంత్రి హరీశ్‌రావు



అమరావతి, ఆగష్టు 8: తెలంగాణ ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు దంపతులు శ్రీశైల మహాక్షేత్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారలను సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రధానగోపురం వద్ద దేవస్థాన అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి అమ్మవార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పార్టీ మారిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఈటల సవాల్ ..

న్యూఢిల్లీ, ఆగష్టు 8:పార్టీ మారిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. పార్టీ మారిన 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ? దమ్ముంటే రాజీనామా చేసి ప్రజాభిప్రాయం కోరాలన్నారు. ఉప ఎన్నికలకు వెళ్లాలంటే దమ్ముండాలన్నారు. రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేస్తే.. 5నిమిషాల్లో ఆమోదించారన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచి కొందరు టీఆర్ఎస్ లో మంత్రులుగా కొనసాగుతున్నారన్నారు. దమ్ముంటే రాజీనామా చేసి ప్రజాభిప్రాయం కోరండని ఈటల సవాల్ విసిరారు.

## ములుగు జిల్లా కేంద్రంలో ఈ నెల 13న జరగనున్న లోక్ అదాలత్







ములుగు, ఆగష్టు 8 (నేటినిజం ప్రతినిధి)ములుగు జిల్లా కేంద్రంలో ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను ములుగు జిల్లా ప్రజలు వినియోగించుకోగలరు.

ములుగు జిల్లా ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఖఎఖ లలితా శివ జ్యోతి.గౌరవ నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ, మరియు ములుగు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశానుసారం తేదీ 13/08/2022, శనివారము రోజున జిల్లా కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును. ఇట్టి రాజీపడదగు కేసులు క్రిమినల్ మరియు సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగదా కేసులు, వివాహ మరియు, కుటుంబ తగాదా కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లిమ్, కేసులు, చిట్ ఫండ్స్ చెక్ బౌన్స్ కేసులు ఇతర రాజీపడదగు కేసులు, పరిష్కరించ పడతాయని తెలియజేసారు.

ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఖఎఖ లలితా శివ జ్యోతి గారు.





## ఇంటర్మీడియట్ ఒకేషనల్ పారామెడికల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



కరీంనగర్ , ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): 2022-23 విద్యా సంవత్సరానికి గాను దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తయి వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా 10వ తరగతి పాసై.. స్కాలర్షిప్ అర్హతగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యాలు అందిస్తున్నట్లు బ్లూమింగ్ ఎడ్యుకేషన్ల్ చారిటబుల్ ట్రస్టు గౌరవ అధ్యక్షుడు పామరాజు రామరావు, బ్లూమింగ్ వొకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ యం.ఏ ఖుద్దూస్ లు ఒక ప్రకటన లో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల నుండి తమ కళాశాలలో ప్రవేశాలు పొందడానికి ఆగస్టు15 వరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వారు 1)బైపిసి/ఎంఎల్ టి 2) బైపీసీ/ఎంపీ హెచ్డబ్ల్యూ (నర్సింగ్) 3)బైపీసీ/ఎసిపి (అగ్రికల్చర్) 4)ఎంపిసి/ఈటి 5) సీఈసీ/ఐఎం వంటి కోర్సులలో సీట్లు తమ కళాశాలలో పరిమితంగా ఉన్నాయని, వీరి కోసం ప్రత్యేక చదువు..నిష్ణాతులైన ఉపన్యాసకులచే శిక్షణా కార్యక్రమములు ఆన్ జాబ్ ట్రైనింగ్ (ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో) ఉంటాయని ఈ కోర్సులు విజయవంతం గా పూర్తిచేసి ఉత్తీర్ణత సాధించిన వారందరికి 2 సంవత్సరాల అనంతరం ట్రస్టు ద్వారా ఒక్కొక్క విద్యార్థికి 10వేల నుండి 15వేల వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందడానికి 10వ తరగతి మెమో, ఆధార్ కార్డ్, 2ఫోటోలతో ఆగష్టు 15 లోగా కాలేజీలా పేరు నమోదు చేసుకోవలని.. మరిన్ని వివరాలకై బ్లూమింగ్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ కరీంనగర్ లో నేరుగా సంప్రదించాలని..లేదా 9908423 250 6309602790 ఫోన్ చేయాలని తెలపారు. ఈ ట్రస్టుకు సంఘీభవంగా శ్రీ సప్తగిరి లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరి గడప కోటేశ్, వినియోగధారుల హాక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షులు వెంకన్న. నేషనల్ హుమెన్ రైట్స్ యాంటీ కరప్షన్, యాంటి క్రైమ్ బ్యూర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## పొన్నం ప్రభాకర్ గారి పాదయాత్రను విజయవంతం చేయండి

**-పాదయాత్ర పోస్టర్ను ఆవిష్కరించిన: పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి**





రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): నేడు మంగళవారం జరిగే కరీంనగర్ మాజీ ఎంపీ తెలంగాణ ఉద్యమ నేత పొన్నం ప్రభాకర్ గారి పాదయాత్రను విజయవంతం చేయాలని సోమవారం వేములవాడ పట్టణంలో పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ 75వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆజాదిక అమృత్ ఉత్సవాల సందర్భంగా పాదయాత్ర చేపడుతున్నారని మరియు అనేక ప్రజా సమస్యల గురించి ఈ పాదయాత్రను చేపడుతున్నారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు నాగుల రాము గౌడ్, వస్తాడు కృష్ణ గౌడ్, నాగుల మహేష్ తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రీవేన్స్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి): పోలీస్ గ్రీవేన్స్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి.... సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన గ్రీవేన్స్ సందర్భంగా వివిధ సమస్యల పై వచ్చిన ప్రజాఫిర్యాదులను పోలీస్ కమిషనర్ స్వీకరించి పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణ చర్యల నిమిత్తం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వచ్చిన ఫిర్యాదులలోభూ వివాదాలు, కుటుంబ తగాదాలకు, ఇతర ఫిర్యాదులు వరకు వచ్చాయి. ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

## లోక్‌సభలో విద్యుత్తు సవరణ బిల్లు.. వ్యతిరేకించిన విపక్షాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 8:వివాదాస్పద విద్యుత్తు సవరణ బిల్లు-2022ను ఇవాళ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్ష పార్టీలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. విద్యుత్తు సరఫరాలోకి ప్రైవేటు కంపెనీలు ప్రవేశించేలా ఈ బిల్లు అవకాశం ఇవ్వనున్నది. కాంగ్రెస్, లెఫ్ట్, టీఎంసీ, డీఎంకే పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. రాజ్యాంగంలో సమాఖ్యా సూత్రాలను ఉల్లంఘించినట్లు ఉందని పార్టీలు ఆరోపించాయి. విద్యుత్తు రంగంలో ప్రైవేటీకరణ సరికాదన్నారు. విపక్ష పార్టీలు విద్యుత్తు బిల్లుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విద్యుత్తు శ్రాఖ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. ఈ బిల్లు వల్ల రైతులకు ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఉచిత కరెంటు కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది రైతు వ్యతిరేక బిల్లు అని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ ఆరోపించారు.

## తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ ఎగ్జామ్ వాయిదా

హైదరాబాద్, ఆగష్టు 8:తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ ఎగ్జామ్ వారం రోజుల పాటు వాయిదా పడింది. ఈ నెల 21న నిర్వహించాల్సిన ఎగ్జామ్‌ను 28న నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. ఈ నెల 18వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని బోర్డు సూచించింది. సాంకేతిక కారణాలతోనే పోలీసు కానిస్టేబుల్ ఎగ్జామ్‌ను వారం రోజుల పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు తెలిపింది. నిన్న రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐ ప్రిలిమ్స్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

## మంత్రికి ఏడాది జైలుశిక్ష.. ఆ వెంటనే బెయిల్ మంజూరీ

కాన్పూర్, ఆగష్టు 8: యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న రాకేశ్ సచన్‌పై .. అక్రమ ఆయుధం కలిగి ఉన్న కేసులో ఏడాది జైలు శిక్ష ఖరారు అయ్యింది. ఆయనకు రూ.1500 ఫైన్ కూడా విధించారు. అయితే రెండు రోజుల క్రితం కాన్పూర్ కోర్టులో గమ్మత్తు జరిగింది. 1991, ఆగష్టు 13 నాటి కేసులో మంత్రిని కోర్టు దోషిగా తేల్చింది. అక్రమ రీతిలో రైఫిల్ కలిగి ఉన్నట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని మంత్రి రాకేశ్ .. కోర్టు రిజిస్టర్ నుంచి లాక్కెళ్లినట్లు తెలిసింది. కోర్టు ఫైల్‌ను మంత్రి రాకేశ్ ఎత్తుకెళ్లినట్లు రీడర్ కామిని మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ వద్ద ఫిర్యాదు చేసింది. ఇక సోమవారం రోజున మంత్రి రాకేశ్ కోర్టు ముందు ప్రత్యక్షం అయ్యారు. ఫైల్ తీసుకువెళ్లినట్లు మీడియా తనను చిత్రీకరించిందని, కానీ దాంట్లో వాస్తవం లేదన్నారు. శిక్షా కాలం మూడేళ్ల లోపు ఉన్న కారణంగా.. 50 వేల బాండ్‌పై మంత్రి రాకేశ్‌కు బెయిల్ మంజూరీ చేశారు.

## విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఏపీలో నిరసనలు





అమరావతి, ఆగష్టు 8: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విద్యుత్ సవరణ బిల్లు 2022ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇవాళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి , కాకినాడ, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర పట్టణాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాను నిర్వహించారు.

విద్యుత్, సహజ ఇంధన వనరులను స్వదేశి, విదేశి ప్రైవేట్ పెట్టుబడి దారులు దారాదత్తం చేయరాదని నినాదాలు చేశారు. విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు.

## పలువురికి వివాహ శుభలేఖలు అందజేసిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, ఆగష్టు 8 (నేటినిజం ప్రతినిధి): ఈ నెల 20న జరగనున్న రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తనయుడు డా.పువ్వాడ నయన్ రాజ్ వివాహ వేడుకను పురస్కరించుకుని ఖమ్మం నగరంలో పలువురికి వివాహ వేడుక ఆహ్వాన పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు.

ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృషారావు, కొప్పు నరేష్, మేళ్లచెరువు వెంకటేశ్వర్లు, పారా నాగేశ్వరరావు, తదితరులను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిసి వివాహ శుభలేఖలను అందజేసి ఆహ్వానించారు.

## పీరీల పండగకు హాజరైన కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క



ములుగు, ఆగష్టు 8 (నేటినిజం ప్రతినిధి) ఈ రోజు ములుగు మండలం లోని కాశీనీదేవిపేట,జంగాల పల్లి గ్రామములో పీరీల పండగకు హాజరైన కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క గారు

ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షులు మహమ్మద్ చంద్ పాషా,మాజీ సహకార సంఘం చైర్మన్ కునూరు అశోక్ గౌడ్,గ్రామ కమిటీ అధ్యక్షులు జగన్,

జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్ యాదవ్, యస్ టి సెల్ మండల అధ్యక్షులు అలోత్ దేవిసింగ్, కాసిందేవిపేట సర్పంచ్ మహమ్మద్ అహ్మద్ పాషా,

కర్నే రతన్,భాగు వాన్ రెడ్డి సర్పంచ్ సోమ పారిజాతం -వెంకటస్వామి, రాయినిగుడెం సర్పంచ్ పిడబోయిన స్వామి,

గ్రామ కమిటీ యూత్ అధ్యక్షులు సుమాన్,మధు

నాయకులు పెద్ద సమ్మి రెడ్డి, చిన్న సమ్మిరెడ్డి, రాం రెడ్డి, వెలకంటి దనమ్మ, దేవర నేని సుధాకర్ రావు,పెరల పుష్పమ్మ, అల్లే కుమారస్వామి, ప్రమీల, చంద్రయ్య, సాంబరాజ్యం, ఇండ్ల రాంబాబు, రామ గాని రాజేందర్, రామ గాని రామకృష్ణ, మధు మోషినిరావు, రవిచందర్ రావు, దేవేందర్ రావు, బండి మధు, ఇండ్ల రవి, నల్లని సత్యానారయణ రావు, పి సత్యానారాయణ రావు, సాంబయ్య లతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఖమ్మం, ఆగష్టు 8 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ అదే విధంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చిత్రపటానికి ఖమ్మం పట్టణంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్స్ మెడికల్ అకాడమీ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య హాజరై పాలాభిషేకం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ యువ జన విభాగం జిల్లా అధ్య క్షులు చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లా డుతూ ఖమ్మం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయడం సంతో షకరమైన విషయమని దీనికోసం అహర్నిశలు కష్టపడి జిల్లా అభివృద్ధి కోసం మెడికల్ కళాశాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజ య్ కుమార్ తీసుకురావడం జరిగిం దని, జిల్లా అభివృద్ధిలో మరో కలిగితు రాయిగా "మెడికల్ కళాశాల" ఏర్పా టు జంగబోతుందని ఇది జిల్లాకు మణిహారం కాబోతుందని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజ య్ కుమార్ జిల్లా స్వరూపాన్ని మా ర్చారని, ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల కరస్పాండెం ట్ రాయల సతీష్, మరియు ఉపాధ్యా యులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

